

రేపటి నుంచి మల్లన్న పెద్దపట్నం మహోత్సవం 6లో..

ఆర్జీ-2 జీఎం ఆఫీస్ ఎదుట ఏఐటీయూసీ ధర్నా 6లో..

# బదిలీల సందడి



- 40 శాతం వరకు ఉద్యోగులకు స్థానచలనం
- ముగిసిన దరఖాస్తుల గడువు
- సీనియారిటీ, ఖాళీల జాబితాల ప్రదర్శన
- పారదర్శకంగా చేపట్టేందుకు కలెక్టర్ సన్నాహాలు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

ఐదేళ్ల తర్వాత ఉద్యోగుల సాధారణ బదిలీలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో జిలాలో సందడి నెలకొన్నది. శాఖల వారీగా ఈనెల 8 నుంచి 12వ తేదీ వరకు బదిలీల కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం పేర్కొంది. ఈ మేరకు గత నాలుగు రోజుల నుంచి ఉద్యోగులు తమ అవకాశాలను బట్టి దరఖాస్తు చేసుకుంటున్నారు. పోలీస్, విద్యా శాఖ మినహా అన్ని శాఖల్లో బదిలీలు జరగనున్నాయి. నాల్గవ తరగతి ఉద్యోగి నుంచి మొదలుకుని గెజిటెడ్ స్థాయి ఉద్యోగులను బదిలీ చేయనున్నారు. జిల్లా, జోనల్, మల్టీజోనల్ స్థాయిలోనూ బదిలీలు జరగనున్నాయి.

శుక్రవారం సాయంత్రంకల్లా దరఖాస్తుల ప్రక్రియ ముగిసింది. ఉద్యోగుల సాధారణ బదిలీలు చివరగా 2018లో జరగగా, 2021లో కొత్త జోనల్ల ప్రకారం చేపట్టిన 317 జీఓను అనుసరించి బదిలీలు జరిగాయి. 317లో బదిలీపై వచ్చిన వారికి కూడా ఇప్పుడు బదిలీ చేసుకునేందుకు అవకాశం దక్కింది. ఈ బదిలీల సందర్భంగా ప్రభుత్వం నిబంధనల్లో మార్పులు తీసుకవచ్చింది. గతంలో రెండేళ్ల సర్వీస్ పూర్తిచేసుకున్న వాళ్లు బదిలీ చేసుకునేందుకు అర్హత విధించగా, ప్రస్తుతం కూడా అదే నిబంధన కొనసాగుతున్నది. అలాగే గతంలో ఐదేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న వాళ్లకు తప్పనిసరి బదిలీ చేయాలనే నిబంధన ఉండగా, ఈసారి దానిని నాలుగు సంవత్సరాలకు కుదించారు. ఆయా శాఖల్లో ఉన్న ఉద్యోగుల్లో దరఖాస్తు చేసుకున్న వారిలో 20 శాతానికి మించి బదిలీ చేయరాదనే నిబంధన ఉండగా, దానిని ఈసారి 40 శాతానికి పెంచారు. బదిలీ చేసే వారి శాతాన్ని పెంచడంతో పాటు తప్పనిసరి బదిలీలను నాలుగేళ్లకు కుదించడంతో ఆయా శాఖల్లో చాలా మంది బదిలీ అయ్యే అవకాశాలున్నాయి. నాల్గవ తరగతి ఉద్యోగులు, రికార్డు అసిస్టెంట్లు, టైపిస్టులు, జూనియర్ అసిస్టెంట్ల బదిలీలు జిల్లా స్థాయిలో, సీనియర్ అసిస్టెంట్లు, సూపరింటెండెంట్లు జోనల్ స్థాయిలో, గెజిటెడ్ అధికారులు మల్టీజోనల్ స్థాయిలో బదిలీలు జరగనున్నాయి.

## 20వ తేదీకల్లా పూర్తి..

పెద్దపల్లి జిల్లా కాళేశ్వరం జోన్ కింద ఉన్నది. దీంతో పాటు మంచిర్యాల, కొమురంభీం ఆసిఫాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలు ఉన్నాయి. అంతేగాకుండా కొన్ని శాఖల్లో అంతకంటే ఎక్కువ మందిని బదిలీ చేసేందుకు జిల్లా కలెక్టర్లకు విస్తృత అధికారాలను ప్రభుత్వం కల్పించింది.

జిల్లాలో పైరవీలు, అక్రమాలకు తావు లేకుండా బదిలీలు నిర్వహించేందుకు పారదర్శకంగా వ్యవహరించాలని ఆయా శాఖల జిల్లా అధికారులకు కలెక్టర్ ఇటీవల సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. శాఖల వారీగా మంజూరైన ఉద్యోగుల సంఖ్య, పనిచేస్తున్న వారి సంఖ్య, వాళ్ల సీనియారిటీ, ఖాళీల జాబితాలను మూడు రోజుల క్రితమే నోటీస్ బోర్డులపై ప్రదర్శించారు. వాటి ఆధారంగా ఉద్యోగులు దరఖాస్తు చేసుకుని మూడు, నాలుగు ఆప్షన్లు ఇస్తున్నారు. జిల్లాలోని విద్యా శాఖ, పోలీస్ శాఖ మినహా ఇతర శాఖల్లో రెగ్యులర్ ఉద్యోగులు 2వేల మందికి పైగా పనిచేస్తున్నారు. గ్రామపంచాయతీల్లో పనిచేసే కార్యదర్శులతో పాటు జూనియర్ పంచాయతీ కార్యదర్శులు దాదాపు నాలుగేళ్ల నుంచి పని చేస్తున్నందున వారందరినీ బదిలీ చేయాలనే ఆలోచనలో కలెక్టర్ ఉన్నట్లుగా తెలుస్తున్నది. దీంతో కార్యదర్శులు అందరూ బదిలీ కోసం దరఖాస్తు చేస్తున్నారు. దరఖాస్తుల ప్రక్రియ శుక్రవారం నాటితో ముగిసింది.

దరఖాస్తులను శాఖల వారీగా పరిశీలన చేసి ఈనెల 20వ తేదీకల్లా బదిలీలు పూర్తి చేయనున్నారు. 23వ తేదీలోపు బదిలీ అయిన స్థానంలో రిపోర్టు చేయాల్సి ఉంటుంది. బదిలీలకు సంబంధించి ప్రభుత్వం తీసుకవచ్చిన నిబంధనలు ఉద్యోగులకు అనుకూలంగా ఉన్నాయని, గత ప్రభుత్వం తీసుకవచ్చిన జీవో 317 వల్ల జరిగిన పొరపాట్లతో పలువురు ఉద్యోగులు ఇబ్బందులకు గురవుతున్నారని, వాటిని సవరిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని నిల బెట్టుకోవాలని టీఎన్జీఓల సంఘం జిల్లా అధ్యక్షుడు బొంకూరి శంకర్ ప్రభుత్వాన్ని కోరారు.

## ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- అదనపు కలెక్టర్ అరుణశ్రీ



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అరుణశ్రీ

కోల్‌సిటీ, జూలై 12: మహిళలకు అందిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ అరుణశ్రీ కోరారు. శుక్రవారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో జిల్లా మహిళా సాధికారిత కేంద్రం ఆధ్వర్యంలో పారిశుధ్య మహిళా కార్మికులకు, అంగన్‌వాడీ టీచర్స్‌కు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన వంద రోజుల యాక్టివిటీస్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ అరుణశ్రీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు కల్పిస్తున్న పథకాలు, వాటిని పొందాల్సిన పద్ధతులను వివరించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలైన బేటీ బచావో, బేటీ పడావో పథకం ద్వారా ఆడపిల్లల భద్రత, సంరక్షణ పట్ల అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో మహిళా హెల్ప్‌లైన్ నంబర్ 181కు కాల్ చేయాలని, చైల్డ్ కేర్ కోసం 1098కు కాల్ చేయాలని సూచించారు. ఆడపిల్లల పట్ల వివక్షత చూపించకూడదని, వారి చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అందుకు ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎవరైనా సైబర్‌క్రైమ్ భారిన పడితే వెంటనే 1930కి కాల్ చేస్తే మీ డబ్బును సురక్షితంగా తిరిగి పొందే అవకాశం ఉంటుందన్నారు. మహిళలు ఏదైనా ఆకతాయిల వేధింపులకు గురైతే 6303923700కు కాల్ చేసి షీ టీమ్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. రామగుండం కార్పొరేషన్‌ను పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుధ్య కార్మికులు బాధ్యతగా పనిచేయాలని, పారిశుధ్య కార్మికులు ఖచ్చితంగా ఉదయం 5గంటలకు డ్యూటీకి రావాలని ఆదేశించారు. పెద్దపల్లి జిల్లా మహిళా సాధికారిత కేంద్రం కోఆర్డినేటర్ దయా అరుణ మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై మహిళల్లో అవగాహన లేకపోవడం మూలంగా పథకాల ద్వారా లబ్ధి పొందలేకపోతున్నారని, మహిళల్లో ప్రభుత్వ పథకాల పట్ల అవగాహన కల్పించేలా ఈ సదస్సును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెల్ఫేర్ ఆఫీసర్ రవుఫ్‌ఖాన్, కార్పొరేషన్ కమిషనర్ శ్రీకాంత్, షీటీమ్ ఎస్ఐ రాజేంద్రప్రసాద్, జిల్లా లీగల్ ఎయిడ్ కౌన్సిల్ ఎం శ్రీనివాస్, సీడీపీఓ స్వరూపరాణి, జెండర్ స్పెషలిస్టు సీహెచ్ స్వప్న, ఫైనాన్స్ లిటరసీ ఎస్ సంధ్యారాణి, పారిశుధ్య కార్మికులు, అంగన్వాడీ టీచర్స్ పాల్గొన్నారు.

## సంగీత అకాడమీ అధ్యక్షురాలిని కలిసిన ఎమ్మెల్యే



గుంజాల అలేఖ్యకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కళ్యాణ్‌నగర్, జూలై 12: తెలంగాణ రాష్ట్ర సంగీత, నటన అకాడమీ అధ్యక్షురాలిగా పదవీ బాధ్యతలు చేపట్టిన కూచిపూడి నృత్య కళాకారిణి గుంజాల అలేఖ్యను రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అభినందించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని అకాడమీ కార్యాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించిన అలేఖ్యను ఎమ్మెల్యే సన్మానించారు.

### ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌ను సన్మానించిన మక్కాన్‌సింగ్

రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన ప్రీతమ్‌ను హైదరాబాద్‌లో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మక్కాన్‌సింగ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్‌ఈలు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి సారించాలని ఆయన ప్రీతమ్‌ను కోరారు.

### కమిషనరేట్‌లో పలువురు ఎస్ఐల బదిలీ

కోల్‌సిటీ, జూలై 12: రామగుండం కమిషరేట్‌లోని 8మంది ఎస్ఐలను బదిలీ చేస్తూ శుక్రవారం మల్టీజోన్-1 ఐజీ సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్టీపీసీ ఎస్ఐగా సతీష్‌ను నియమించి,అక్కడ పనిచేస్తున్న ఉదయ్‌కుమార్‌ను వీఆర్‌లోకి పంపారు. ఖని వన్‌టౌన్‌లో పనిచేస్తున్న సమ్మయ్యను రామగుండం ఎస్ఐగా వీఆర్‌లో ఉన్న భూమేష్‌ను వన్‌టౌన్ ఎస్ఐగా, వన్‌టౌన్‌లో పనిచేస్తున్న సౌజన్యను బెల్లంపల్లి వన్‌టౌన్‌కు, అక్కడ పనిచేస్తున్న ప్రశాంత్‌ను ఖని వన్‌టౌన్‌కు బదిలీచేశారు.ఆసిఫాబాద్ జిల్లా చింతలమనెపల్లి ఎస్ఐ నరేష్‌ను రామగుండం వీఆర్‌కు, తాండూర్‌లో పనిచేస్తున్న ప్రభాత్‌చందమిశ్రాను ఆసిఫాబాద్‌జిల్లా వీఆర్‌కు పంపారు.

## పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం : ఆర్డీవో



గౌరెడ్డిపేట గ్రామాన్ని సందర్శిస్తున్న ఆర్డీవో గంగయ్య

పెద్దపల్లి రూరల్, జూలై 12 : పరిసరాలు పరిశుభ్రంగా ఉంచినపుడే ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని మండల ప్రత్యేకాధికారి, ఆర్డీవో గంగయ్య అన్నారు. స్వచ్ఛ శుక్రవారం కార్యక్రమంలో భాగంగా మండలంలోని గౌరెడ్డిపేట, ముత్తారం, బొంపల్లి గ్రామాల్లో సందర్శించారు. ఈ సందర్భంగా పలు వీధుల్లో తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, చుట్టూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వర్షపు నీరు నిల్వ కుండా జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. వారి వెంట ఎంపీవో సుదర్శన్‌లతో పాటు పంచాయతీ కార్యదర్శులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

### ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- సుల్తానాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి



నిలువ ఉన్న నీటిని పారబోస్తున్న చైర్‌పర్సన్ తదితరులు

సుల్తానాబాద్, జూలై 12: జ్వరాలు వ్యాపిస్తున్న దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఇంటితోపాటు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సుల్తానాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి రాజమల్లు అన్నారు. సుల్తానాబాద్ పట్టణంలోని పలు వార్డుల్లో శుక్రవారం ప్రత్యేక పారిశుద్య కార్యక్రమాన్ని నిర్వహించారు, ఇంటింటికీ తిరుగుతూ ప్రజలను అప్రమత్తం చేశారు. ఇంటితో పాటు పరిసరాలను ప్రతీ రోజు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆమె వెంట ఏఎన్‌ఎంలు మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

### కునారంలో వైద్య శిబిరం



రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కాల్వశ్రీరాంపూర్, జూలై 12: మండలంలోని కునారం గ్రామంలో శుక్రవారం వైద్య శిబిరం జరిగింది. గ్రామస్తులకు డాక్టర్ సీహెచ్ భావన వైద్య పరీక్షలు నిర్వహించి 55 మందికి మందులు అందజేశారు. అనంతరం పరిసరాల పరిశుభ్రత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామోహనచారి, ఎంపీఓ గోవర్ధన్, హెచ్ఈ ఓ లక్ష్మణ్, గ్రామ కార్యదర్శి శైలజ, ఏఎన్‌ఎం కవిత, ఆశా వర్కర్లు దొడ్ల పద్మ, దొడ్ల సంధ్య, గూళ్ళ శారద పాల్గొన్నారు.

### రాములపల్లిలో ఫీవర్ సర్వే

ఎలిగేడు, జూలై 12 : మండలంలోని రాములపల్లి గ్రామంలో హెల్త్ సిబ్బంది ఇంటింటా ఫీవర్ సర్వే చేశారు. డ్రై డే సందర్భంగా అన్ని గ్రామాల్లో వివిధ శాఖల అధికారులు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు చేపట్టాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు నిస్సిక్రిష్ణాన సూచించారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని అన్నారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు ఉండకుండా జాగ్రత్తలు చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భాస్కర్‌రావు, ఎంపీవో అనిల్‌రెడ్డి, ఏపీఎం సుధాకర్, ఏవో ఉమాపతి, డాక్టర్ ఝాన్సీ గ్రామ ప్రత్యేక అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, వీవోఏ, అంగన్‌వాడీ, హెల్త్ సిబ్బంది, మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. కాగా విద్యార్థులకు చేతుల శుభ్రతతో పాటు పలు అంశాల గురించి అవగాహన కల్పించారు.

## సుల్తానాబాద్ మండలంలో విజృంభిస్తున్న జ్వరాలు



సుల్తానాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జ్వరపీడితులు

సుల్తానాబాద్, జూలై 12 : మండలంలో ఒక్కసారిగా వైరల్ ఫీవర్స్ విజృంభించాయి. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాల్సిన అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడంలో కొంత విఫలం అయిన కారణంగా గ్రామాలలో జ్వరాలు ప్రబలుతున్నాయి. ముఖ్యంగా అల్లీపూర్ గ్రామంలో ప్రజలు జ్వరాలతో మంచం పట్టారు. చాలా మంది గ్రామంలోని ప్రైవేట్ వైద్యులను ఆశ్రయిస్తుండగా మరికొంత మంది జ్వరం తీవ్రత ఎక్కువ ఉన్నవారు సుల్తానాబాద్ ప్రభుత్వ అసుపతిరలో చేరారు. మూడునాలుగు రోజుల నుంచి జ్వరాలతో బాధ పడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. అల్లీపూర్ గ్రామంలో కుటుంబం మొత్తం జ్వరంతో కాళ్లు, కీళ్ల నొప్పులు, తలనొప్పితో బాధపడుతున్నారు. అల్లీపూర్ గ్రామం నుంచి దాదాపు 20మంది వరకు అస్పత్రిలో చేరారు. ప్రస్తుతం ఆస్పత్రిలో ఉన్న బెడ్లు వారితో నిండిపోయాయి. ఒకే కుంటుంబంలో ముగ్గురు, నలుగురు జ్వరాలతో బాధపడుతూ సుల్తానాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో చేరారు. అల్లీపూర్ గ్రామంలో హోటల్ నిర్వాహకులు కారుపాక మంగతోపాటు, ఆమె అత్త రాయమల్లమ్మలు మూడు రోజుల క్రితం ఆస్పత్రిలో తీవ్ర జ్వరంతో చేరారు. కల్లు గీత కార్మికుడు మల్యాల శ్రీనివాస్‌గౌడ్, ఆయన భార్య రజిత, కొడుకు వంశీ కూడా మూడు రోజుల క్రితం జ్వరంతో అస్పత్రిలో చేరారు. జ్వరంతో పాటు కీళ్ల నొప్పులతో వీరు బాధపడుతున్నారు. వీరికి రక్త నమూనాలను శుక్రవారం ఉదయం సేకరించి ల్యాబ్‌కు పంపారు. అలాగే బాలసాని వినోద, ఆమె కొడుకు సాకేత్ జ్వరంతో బాధపడుతూ ఈనెల 10న ఆస్పత్రిలో చేరారు. ఇలా అల్లీపూర్ గ్రామానికి చెందిన వారు చాలామంది ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సుల్తానాబాద్ పట్టణంలోని సుభాష్‌నగర్ తదితర ప్రాంతాలకు చెందిన పలువురు కూడా జ్వరంతో చేరారు. సీజనల్ జ్వరాలతో బాధపడుతున్న వారు ప్రభుత్వ ఆసుపత్రికి ఎక్కువగా వస్తున్నారు. ఓపీ విభాగంలో చూపించుకుని మందులు తీసుకవెళుతున్నారు. కాగా జ్వరాలతో బాధపడుతున్న తమను ఆస్పత్రిలో ఎవరూ పట్టించుకోవడం లేదని బాధితులు ఆరోపిస్తున్నారు. రాత్రిపూట కరెంట్ పోయిన సందర్భంలో చీకట్లో గడపాల్సి వస్తుందని వాపోతున్నారు. గ్రామంలో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్‌ను నిర్వహించాలని, జ్వరాలు రాకుండా నివారణ చర్యలు తీసుకోవాలని వారు అధికారులను కోరుతున్నారు.

### సోమవారం నుంచి మెడికల్ క్యాంప్

- డాక్టర్ అనుదీప్, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్

అల్లీపూర్ గ్రామంలో జ్వరాలతో బాధపడుతున్న వారిని గుర్తించామని, ప్రతి రోజు ఇంటింటి సర్వే జరుగుతుందన్నారు. జ్వరాలను అదుపులోకి తెచ్చేందుకు చేపట్టాల్సిన చర్యల గురించి ఇతర శాఖల అధికారులతో కలిసి నిర్ణయం తీసుకుంటాం. సోమవారం నుంచి గ్రామంలో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేస్తాం.

## రైస్‌మిల్లుల కార్మికుల గదుల్లో పోలీసుల విస్తృత తనిఖీలు

సుల్తానాబాద్, జూలై 12: సుల్తానాబాద్ పోలీసులు శుక్రవారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. సుల్తానాబాద్ ప్రాంతంలోని రైస్ మిల్లుల్లో, ఇటుక బట్టీలలో బీహార్, యూపీ, ఎంపీ, ఒరిస్సా, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాలకు చెందిన కార్మికులు పని చేస్తున్నారు. వీరి నివాస ప్రాంతాలను, రైస్‌మిల్లులోని గదులను ఎస్సై శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు విస్తృతంగా తనిఖీ చేశారు. ముఖ్యంగా గంజాయి వంటి మత్తు పదార్థాల కోసం ఈ తనిఖీలు చేశారు. ఇటీవల రైస్‌మిల్లులో బాలికపై అత్యాచారం, హత్య సంఘటన దృష్ట్యా పోలీసులు ముందు జాగ్రత్త చర్యగా ఇతర రాష్ట్రాల కార్మికుల గదులను తనిఖీ చేశారు. అలాగే రైస్‌మిల్లుల్లో అంతా కవర్ అయ్యే విధంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమీపంలోని లారీ, వ్యాన్‌డ్రైవర్స్ యజమానుల సంఘాల వారితో కూడా పోలీసులు సమావేశమై ప్రమాదాల నివారణ గురించి మద్యం సేవించి వాహనాలను నడపడం వంటి వాటికి కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. బ్యాంకులు ఇతర విద్యా సంస్థలను కూడా పోలీసులు తనిఖీ చేసి బ్యాంకుల్లో రక్షణచర్యలు, అలారమ్ సిస్టమ్, ఫైర్‌సేఫ్టీ సిస్టం వంటి వాటిని పరిశీలించి పలు సలహాలుసూచనలు అందజేశారు.

## ధర్మారంలో కలెక్టర్ సుడిగాలి పర్యటన

- ఐదు గంటల పాటు విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల తనిఖీలు



ఎంపీడీవో కార్యాలయంలో ప్రజలతో మాట్లాడుతున్న కలెక్టర్



కేజీబీవీలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్

పెద్దపల్లి, జూలై 12 (ఆంధ్రజ్యోతి)/ధర్మారం: జిల్లాకు కొత్తగా వచ్చిన కలెక్టర్ కోయ శ్రీహర్ష క్షేత్రస్థాయిలో ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలలు, ఇతర సంస్థలను ఆకస్మికంగా తనిఖీ చేస్తూ హడలెత్తిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బందిలో పారదర్శకత పెంపొందించి ప్రజలకు సంబంధించిన పనులు పెండింగులో ఉండకుండా చర్యలు చేపట్టారు. ప్రభుత్వ విద్యాలయాల ద్వారా మెరుగైన విద్య, ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్యం ప్రజలకు అందించేందుకు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తూ దిశా నిర్దేశం చేస్తున్నారు. పనుల్లో అలసత్వం, నిర్లక్ష్యం వహిస్తున్న వారిపై కొరఢా ఝుళిపిస్తున్నారు. ఎప్పుడు ఏ కార్యాలయానికి వస్తారోనని ఉద్యోగులు అప్రమత్తంగా ఉంటున్నారు. ఉద్యోగులందరూ సకాలంలో కార్యాలయాలకు చేరుకుని విధులు నిర్వహించాలని, సమయం ముగిసే వరకు పని చేయాలని చెబుతున్నారు. ఆయన ప్రతి రోజు ఉదయం 9 గంటలకే క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ కార్యాలయానికి చేరుకుంటున్నారు. క్షేత్ర స్థాయిలో పర్యటనలు చేసిన తర్వాత కలెక్టర్ కార్యాలయంలో రోజుకు రెండు, మూడు సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఒక్క రోజే ధర్మారం మండలంలో 5 గంటల పాటు అలుపు, సొలుపు లేకుండా, ఎక్కడా విశ్రమించకుండా ఆకస్మిక తనిఖీలు నిర్వహించి హడలెత్తించారు. ఉదయం 9:30 గంటలకు మొదలైన తనిఖీలు మధ్యాహ్నం 2:30 గంటల వరకు కొనసాగాయి. దొంగతుర్తి, ఖిలావనపర్తి, బొట్లవనపర్తి, ధర్మారంలో గల పదికి పైగా ప్రభుత్వ ప్రాథమిక, జిల్లా పరిషత్ పాఠశాలలు, కస్తూర్బాగాంధి బాలికల విద్యాలయం, రెండు అంగన్ వాడీ కేంద్రాలను ఆయన సందర్శించారు. అక్కడ ఉన్న వసతులను పరిశీలించడంతో పాటు విద్యా బోధన గురించి ఆరా తీశారు. అటెండెన్స్ రిజిష్టర్లను తనిఖీ చేశారు. విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి జవాబులు రాబట్టారు. ఉన్నత పాఠశాలల్లో లైబ్రరీలను సద్వినియోగం చేసుకోవాలని, ఒక క్లాసు నిర్వహించాలని అన్నారు. ధర్మారం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారం వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించి ప్రజాపాలన కేంద్రాన్ని పరిశీలించి అక్కడికి వచ్చిన ప్రజల విజ్ఞప్తులను విని పరిష్కారం కోసం సిబ్బందికి సూచనలు చేశారు. ఆ తర్వాత తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. ధరణి సమస్యల త్వరగా పరిష్కరించాలన్నారు. ధర్మారంలో ఒక ఎరువుల దుకాణాన్ని సందర్శించి ఎరువుల రిజిష్టర్, స్టాకు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎరువుల కొరత గురించి ఆరా తీసి, యూరియా అమ్మకాలకు సంబంధించి ఈపాస్ మెషిన్‌లో ఎప్పటికప్పుడు వివరాలను నమోదు చేయాలని సూచించారు. మొత్తంగా కలెక్టర్ శ్రీహర్ష ఒక రోజు ఐదు గంటల పాటు సీరియస్‌గా విద్యాలయాలు, కార్యాలయాలను తనిఖీ చేయడంతో ప్రజలు విస్తుపోతున్నారు.




## ఎల్ఎల్‌బీ సెమిస్టర్ పరీక్షలు ఒకేసారి నిర్వహించాలి

గణేశ్‌నగర్, జూలై 12: శాతవాహన యూనివర్సిటీ(ఎస్‌యూ)లో ఎల్ఎల్‌బీ అన్ని సెమిస్టర్ పరీక్షలు ఒకేసారి నిర్వాహించాలని శాతవాహన యూనివర్సిటీ రిజిస్ట్రార్‌కు శుక్రవారం లా విద్యార్థులు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా సీహెచ్ రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడు తూ ఆల్ ఇండియా బార్ కౌన్సిల్ ఎగ్జామ్స్ ఎన్‌రోల్‌మెంట్ కావాలంటే అన్ని సెమిస్టర్లు పాసై ఉండాలన్నారు. విద్యార్థుల సంవత్సర సమ యం వృధా కాకుండా, ఈ విద్యాసంవత్సరంలోనే అన్ని సెమిస్టర్లకు ఒక అవకాశం ఇవ్వాలని రిజిస్ట్రార్‌ను కోరామన్నారు. కార్యక్రమంలో కొట్టే రమేష్, గాండ్ల అజయ్ పటేల్, తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందిస్తున్న లా విద్యార్థులు







## సౌరశక్తిని ప్రత్యామ్నాయంగా వినియోగించాలి

### - పర్యావరణవేత్త, సైక్లిస్ట్ పంకజ్ మెహ్లా


పంకజ్ మెహ్లాను సన్మానిస్తున్న ఎస్సారార్ ప్రిన్సిపాల్ రామకృష్ణ

గణేశ్‌నగర్, జూలై 12: క్రమక్రమంగా పచ్చని అడవులు అంతరించి పోవడం, బొగ్గు, పెట్రోల్, డీజిల్ తదితర ఇందనాల వల్ల వాతావరణ కాలుష్యం పెరిగిపోవడం వల్ల పర్యావరణానికి ముప్పు వాటిల్లుతోందని, సౌరశక్తిని ప్రత్యామ్నాయంగా వినియోగించాలని పర్యావరణవేత్త సైక్లిస్ట్ పంకజ్ మెహ్లా అన్నారు. శుక్రవారం ఎస్సారార్ ప్రభుత్వ కళాశాలకు చేరుకొని అధ్యాపకులకు, విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణకు చేయవలసి న కృషిని వివరించారు. ప్రతిఒక్కరూ సౌరశక్తిని వినియోగించడం ప్రారంభిస్తే పర్యావరణాన్ని కాపాడుకోగలమని సైక్లిస్ట్ పంకజ్ మెహ్లా సైకిల్ ద్వారా కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు నాలుగువేల కిలోమీటర్లు పర్యట న చేస్తూ అందరికీ అవగాహన కల్పిస్తున్నారు. పంజాబ్ హిసార్‌కు చెందిన పంజాబ్ ఇంజనీరింగ్ కళాశాల మూడో సంవత్సరం విద్యార్థి పంకజ్ మెహ్లా 55 రోజులుగా దేశంలోని వివిధ ప్రాంతాల్లో సౌరశక్తిని అందరూ వినియోగించేలా ప్రచారం చేస్తున్నారు. పంకజ్ మెహ్లాను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె రామకృష్ణ, వైస్ ప్రిన్సిపల్ టి రాజయ్య, స్టాఫ్ సెక్రటరీ డాక్టర్ ఎ శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ అధికారులు, విద్యార్థులు అభినందించారు.

## ఉత్తర తెలంగాణ నిధులను దుర్వినియోగం చేయవద్దు


సుభాష్‌నగర్, జూలై 12: ఉత్తర తెలంగాణ ప్రాంతంలోని నీళ్ళు, నిధులు, ఖనిజ సంపదను దుర్వినియోగం చేయవద్దని ప్రొఫెసర్ ఏకు తిరుపతి అన్నారు. శుక్రవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు పీపుల్స్ మూమెంట్ సంస్థ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తర తెలంగాణకు చెందిన 40మంది ప్రసిద్ధ గాయకులకు ఉద్యమ గాన కోకిల పురస్కారంతో సన్మానించారు. అనంతరం ప్రొఫెసర్ ఏకు తిరుపతి మాట్లాడుతూ గోదావరి పరివాహక ప్రాంతాల్లో నీళ్లు, బొగ్గు, విద్యుత్తు, ఇసుక, క్వారీ వంటి అనేక సంపదలు విరివిగా ఉన్నాయన్నారు. వాటిని ఈ ప్రాంతానికే కేటాయించాలన్నారు. కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు మేకల చంద్రశేఖర్, మార్వాడి సుదర్శన్, ముక్కెర సంపత్‌కుమార్, అన్నబోయిన ప్రశాంత్ పాల్గొన్నారు.

**ఇల్లందకుంట/జమ్మికుంట:** మండలంలోని కనగర్తికి చెందిన రామంచ భరత్‌కు ఉద్యమ గానకోకిల పురస్కారం అందుకున్నారు. ఉత్తర తెలంగాణ పీపుల్స్ మూ మెంట్ వ్యవస్థాపక అధ్యక్షుడు మేకల చంద్రశేఖర్‌యాదవ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముక్కెర సంపత్ శుక్రవారం కరీంనగర్‌లోని ప్రెస్ భవన్‌లో ఉత్తర తెలంగాణ పీపుల్స్ మూమెంట్ ఉద్యమసంస్థ ఆవిర్భావం సందర్భంగా రామంచ భరత్‌కు ఉద్యమ గానకోకిల పురస్కారాన్ని అందజేసి శాలువాతో సన్మానించారు.









# కరీంనగర్‌లో ముంబై పోలీసులు

● రెండు రోజులపాటు పలు కాలనీల్లో విస్తృత తనిఖీలు ● పలువురి విచారణ.. ఒకరి అరెస్టు ● ట్రాన్సిట్ వారెంట్‌పై ముంబైకి తరలింపు




కరీంనగర్ క్రైం, జూలై 12: సైబర్ నేరగాళ్ల కోసం ముంబై ఈస్ట్ రీజియన్ సైబర్ వింగ్ పోలీసులు గురువారం, శుక్రవారం రెండు రోజులు కరీంనగర్‌లోనే మకాం వేశారు. అంతర్జాతీయ సైబర్ నేరగాళ్లతో చేతులు కలిపి కొందరు కరీంనగర్‌లో ఒక డొల్ల కంపెనీ పేరిట జాయింట్ బ్యాంక్ అకౌంట్ తెరిచి డబ్బులు బదిలీ చేశారని వారి విచారణలో తేలింది. కరీంనగర్‌కు చెందిన కొందరు వ్యక్తులు ఈ కేసులో నిందితులుగా ఉన్నారు. వారిని పట్టుకునేందుకు ముంబై పోలీసులు కరీంనగర్‌లోని ఆదర్శనగర్, హుస్సేనిపుర, సుభాష్‌నగర్, అశోక్‌నగర్ తదితర ప్రాంతాల్లో స్థానిక పోలీసుల సహాయంతో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. అనుమానితులు నలుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు వారి ఇళ్లలో తనిఖీలు నిర్వహించారు. విచారణ నిర్వ హించి కొందరిని వదిలిపెట్టారు. మరో ఇద్దరు నిందితులు పరారయినట్లు తెలిసింది. శుక్రవారం కరీంనగర్‌కు చెందిన అహ్మద్‌ఖాన్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్న ముంబాయి సైబర్ క్రైం పోలీసులు అతడిని కరీంనగర్ కోర్టులో హాజరుపరచి ట్రాన్సిట్ వారెంట్‌పై ముంబైకి తీసుకువెళ్లారు. అక్కడి కోర్టులో హాజరుపరచనున్నారు. మార్చి నెలలో ముంబైలో ఓ బాధితుడి ఫిర్యాదుతో నమోదైన సైబర్ క్రైం కేసులో కరీంనగర్ లోని ఒక ప్రైవేట్ బ్యాంక్‌లో మందాని ఇంపాడ్ ఫూర్ వెల్ఫేర్ ట్రస్ట్ సంస్థ పేరిట సెక్రెటరీ, ట్రెజరర్, సభ్యులు మొత్తం ఏడుగురి పేరిట జాయింట్ బ్యాంక్ అకౌంట్ తెరిచారు. ఈ ఖాతాలోకి సైబర్ క్రైంకు సంబంధించిన భారీ మొత్తంలో డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేసినట్లు ముంబై సైబర్ పోలీసులు గుర్తించారు. నిందితులను విచారించేందుకు కరీంనగర్‌కు వచ్చారు. ప్రైవేట్ బ్యాంక్‌లో డొల్ల కంపెనీ పేరిట ఉన్న ఖాతాలో లావాదేవీలకు సంబంధించిన సమాచారాన్ని, రికార్డులతోపాటు నిందితుడి వద్ద లభించిన కొన్ని కీలక పత్రాలను ముంబై పోలీసులు స్వాధీనం చేసుకుని వెంట తీసుకు వెళ్లినట్లు సమాచారం. సైబర్ నేరస్థులతో కరీంనగర్ వ్యక్తులకు ఏమిటి సంబంధం? వారికి పరిచయం ఏమిటి? అనేది తెలియడంలేదు. కరీంనగర్‌కు చెందిన కొందరికి ఉద్యోగం లేదా కమిషన్ పేరిట ఆశ చూపించి వారిచేత ఒక జాయింట్ అకౌంట్ తెరచి, సైబర్ నేరగాళ్లు ఫ్రాడ్ చేసిన డబ్బులను ఆ ఖతాలోకి మళ్లించిన అనంతరం డ్రా చేసుకున్నట్లు తెలిసింది. సైబర్ క్రైంతో సంబంధం ఉన్నది కాబట్టే ఒకరిని అరెస్టు చేశారని నిర్ధారణ అయింది. ఈ కేసుకు సంబంధించి ముంబై సైబర్ పోలీసులు వివరాలు చెప్పలేదని, స్థానికంగా విచారణకు సహకరించాలని కోరారని స్థానిక పోలీసు అధికారులు చెబుతున్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


పొలాడి సాయికుమార్ (ఫైల్)

కరీంనగర్ క్రైం, జూలై 12: కరీంనగర్ కోతిరాంపూర్‌లో శుక్రవారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదంలో బొమ్మకల్ గ్రామం కృష్ణనగర్ కాలనీకి చెందిన పొలాడి సాయికుమార్ (26) మృతి చెందాడు. అతడి స్నేహితుడు కత్తెర్ల అరవింద్‌కు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... సాయికుమార్, అరవింద్ బైక్‌పై అల్గునూర్ నుంచి కరీంనగర్‌కు వస్తుండగా కోతిరాంపూర్ వద్ద రోడ్డు పక్కన పార్క్ చేసిన వ్యాన్‌ను ఢీకొన్నారు. దీంతో సాయికుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన అరవింద్‌ను 108 సిబ్బంది అన్వేష్, మనోహర్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. వ్యాన్ పార్కింగ్ లైట్లు వేసుకోకుండా నిర్లక్ష్యంగా, అజాగ్రత్తగా రోడ్డు పక్కన పార్క్ చేయటంతో చీకట్లో వ్యాన్‌ను వెనుక నుంచి బైక్ ఢీకొట్టిందని మృతుడి తండ్రి మహేందర్ పోలీసులకు ఫిర్యాదు చేశా డు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## చికిత్స పొందుతూ యువకుడు మృతి

వేములవాడ రూరల్, జూలై 12: మండలంలోని నూకలమర్రికి చెందిన ఓ యువకుడు చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకా రం.. నూకలమర్రి గ్రామానికి చెందిన పాలకూర్తి ప్రశాంత్(20) అదే గ్రామానికి చెందిన యువతిని ప్రేమించాడు. తన ప్రేమ విఫలమవుతుందేమోనని భయంతో వారం రోజుల క్రితం గడ్డి మందుతాగాడు. కుటుంబ సభ్యులు ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించి శుక్రవారం మృతి చెందాడు. ప్రశాంత్ కుటుంబసభ్యులు ఆ యువతి ఇంటి ఎదుట మృతదేహంతో ఆందోళన నిర్వహించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ప్రశాంత్ కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

సిరిసిల్ల క్రైం, జూలై 12: తంగళ్లపల్లి మండలంలోని రాళ్లపేటకు చెందిన ఇలవేని నవీన్ అనే వ్యక్తికి ఓ హత్య కేసులో జీవిత ఖైదు, రెండు వేల రూపాయల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్ ప్రేమలత శుక్రవారం తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ వివరాల ప్రకారం.. తంగళ్లపల్లి మండలంలోని రాళ్లపేటకు చెందిన ఇలవేణి స్వప్నకు ఆమె మరిది అయిన నవీన్ మధ్య తరుచు గొడవలు జరిగేవి. ఈ క్రమంలో 2020 సెప్టెంబరు 7న ఇద్దరి మధ్య గొడవ జరిగింది. స్వప్న తండ్రి గీస రాములు వీరిని అడ్డుకునే ప్రయత్నం చేశాడు. కోపోద్రిక్తుడైన నవీన్ పారతో రాములు తలపై కొట్టాడు. తీవ్రంగా గాయపడిన రాములును ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు తంగళ్లపల్లి పోలీసులు కేసు నమోదుచేసి నవీన్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అప్పటి సీఐ సర్వర్ కోర్టులో చార్జీషీట్ దాఖలు చేశారు. పీపీ నర్సింగరావు కేసు వాదించారు. కోర్టు మానిటరింగ్ ఎస్‌ఐ రవీందర్‌నాయుడు ఆధ్వర్యంలో కానిస్టేబుల్ నరెందర్ కోర్టులో 13 మంది సాక్షులను ప్రవేశపెట్టారు. నేరం రుజువు కావడంతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రేమలత నవీన్‌కు జీవిత ఖైదు, జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు.

### ● జగిత్యాలో మరొకరికి..

జగిత్యాల టౌన్: డబ్బుల విషయం, భూమి తగాదాల్లో కట్టుకున్న భార్యను కత్తితో పొడిచి హత్య చేసి, అడ్డువచ్చిన కూతురిని గాయపరిచిన కేసులో తండ్రికి జీవిత ఖైదు జైలు శిక్షతోపాటు 6,500 రూపాయల జరిమానా విధిస్తూ జగిత్యాల కోర్టు అడిషనల్ సెషన్స్ జడ్జి నారాయణ శుక్రవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం జగిత్యాల జిల్లాలోని పెగడపల్లి మండలం దోమలకుంటకు చెందిన నక్క గంగవ్వకు అదే గ్రామానికి చెందిన నక్క రమేష్‌తో వివాహం జరిగింది. వీరికి కూతురు, కుమారుడు ఉన్నారు. రమేష్ ఉపాధి కోసం గల్ఫ్‌కు వెళ్లినప్పటికీ భార్య, పిల్లల పోషణకు డబ్బులు పంపలేదు. స్వదేశానికి వచ్చిన రమేష్‌ను డబ్బుల విషయంపై భార్య గంగవ్వ, కుమారుడు జలందర్ నిలదీశారు. దీంతో రమేష్ తన డబ్బులను తన సోదరి పద్మకు పంపించానని, తాను సంపాదించిన డబ్బులు అడిగే హక్కు మీకు లేదని చెప్పాడు. అనంతరం రమేష్ తన సోదరి ఇంటికి వెళ్లి అక్కడే ఉండేవాడు. 2020 నవంబరు 13న పాత పగలు మనసులో పెట్టుకుని కుమారుడు జలందర్‌ను కత్తితో పొడిచి హత్య చేశాసిన రమేష్ జైలు శిక్ష అనుభవించాడు. జైలు నుంచి తిరిగి బెయిల్‌పై వచ్చిన రమేష్ నడవడికలో మార్పు రాలేదు. పాత పగలు మనుసులో పెట్టుకుని 2022 డిసెంబర్ 18న తన భార్య గంగవ్వను కత్తితో పొడవడంతో పాటు అడ్డుగా వచ్చిన కూతురు స్నేహపై కూడా దాడికి పాల్పడ్డాడు. తీవ్ర గాయాలైన గంగవ్వ మృతి చెందగా స్వల్ప గాయాలతో బయటపడ్డ కూతురు స్నేహ అదే రోజు పెగడపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పటి సీఐ రాంమూర్తి కేసు నమోదు చేయగా కోర్టు డ్యూటీ అధికారులు కిరణ్‌కుమార్, సాగర్‌లు సరైన సాక్ష్యులను కోర్టులో ప్రవేశ పెట్టారు. అదనపు పీపీ మల్లికార్జున్ కేసు వాదించగా నేరం రుజువు కావడంతో నిందితుడు రమేష్‌కు జీవిత ఖైదు విధించారు.

## కరీంనగర్ కోర్టుకు మావోయిస్టు పొలిట్ బ్యూరో సభ్యుడు అమిత్‌బాగ్చి

కరీంనగర్ క్రైం, జూలై 12 : మావోయిస్టు పోలిట్‌బ్యూరో సభ్యుడు అమిత్‌బాగ్చి అలియాస్ అమిత్‌ను కరీంనగర్ రూరల్ పోలీసులు శుక్రవారం కరీంనగర్ కోర్టులో హాజరుపరిచారు. అనంతరం కోర్టు ఆదేశాలతో చర్లపల్లి జైలుకు తరలించారు. అమిత్‌బాగ్చితోపాటు మరికొందరు ప్రభుత్వంపై కుట్రచేశారని 2008లో కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసులో 2018లో ఒకసారి అమిత్‌బాగ్చిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. అమిత్‌బాగ్చి అప్పటి నుంచి కోర్టు వాయిదాలకు హాజరుకాలేదు. దీంతో కోర్టు వారెంట్ జారీ చేసింది. జార్ఖండ్ రాష్ట్రం రాంచి జైలులో ఉన్న అమిత్‌బాగ్చిని కరీంనగర్ రూరల్ పోలీసులు పీటీ వారెంట్‌పై కరీంనగర్‌కు తీసుకువచ్చి ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షల అనంతరం కోర్టులో హాజరుపరచి, చర్లపల్లి జైలుకు తరలించారు.

## భూమి అమ్మిన డబ్బులు ఇవ్వడం లేదని ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న దేవరాజు

చందుర్తి జూలై 12: చందుర్తి మండలం మర్రిగడ్డలో భూమి అమ్మిన డబ్బులు తనకు ఇవ్వలేదని ఓ వ్యక్తి శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గ్రామస్థులు, కుటుంబ సభ్యుల కథ నం ప్రకారం.. రామన్నపేటకు చెందిన దుమ్మ దేవరాజు ఇదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి తన భూమిని రెండు సంవత్సరాల క్రితం విక్రయించాడు. కొన్ని డబ్బులు చెల్లించిన కొనుగోలుదారుడు మిగిలిన డబ్బులను ఇవ్వడం లేదు. రెండేళ్లుగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని మనోవేదనకు గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు స్థానికులు తెలిపారు. ఈ విషయమై చందుర్తి ఎస్సై శ్రీకాంత్ మాట్లాడుతూ బాధితుడు 100 నంబర్‌కు డయల్ చేసి తనను హత్య చేయడానికి ప్రయత్ని స్తున్నారని చెప్పడంతో పోలీసులు అక్కడికి వెళ్లారని చెప్పారు. పురుగుల మందు డబ్బాతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా పోలీసులు వెంటనే 108లో వేముల వాడ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

## సస్పెండ్ చేశారని ఆర్టీసీ డ్రైవర్..


చికిత్స పొందుతున్న సీహెచ్‌ఎం రెడ్డి

భగత్‌నగర్, జూలై 12: కరీంనగర్-1 డిపోకు చెందిన సీహెచ్‌ఎం రెడ్డి అనే ఆర్టీసీ డ్రైవర్ శుక్రవారం ఆత్మహత్యాయత్నం చేశాడు. నాలుగు రోజుల క్రితం అల్కాహాల్ పరీక్షలో 21 శాతం నమోదు కావడంతో అధికారులు అతడిని సస్పెండ్ చేశారు. శుక్రవారం ఉదయం డిపోకు వచ్చిన సీహెచ్‌ఎం రెడ్డి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. వెంటనే అతనిని కరీంనగర్‌లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సీహెచ్‌ఎం రెడ్డిని ఆర్టీసీ జోనల్ ఈడీ వినోద్‌కుమార్, ఆర్టీసీ అధికారులు పరామర్శించారు.

## వివాహిత ఆత్మహత్య

మల్యాల, జూలై 12: మండలంలోని నూకపల్లికి చెందిన ఓ వివాహిత ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఓలపు స్వప్న (35) అనే మహిళ భర్త నర్సయ్య ఉపాధి కోసం విదేశాలకు వెళ్లాడు. కూతురు, అత్తమామలతో కలిసి నూకపల్లిలో ఉంటున్న స్వప్న భర్త కోసం మానసిక వేదనకు గురవుతూ ఎడబాటు భరించలేక శుక్రవారం ఇంట్లోనే ఉరి వేసుకుంది. స్వప్నకు ఏడేళ్ల కూతురు ఉంది. స్వప్న తండ్రి పర్శరాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## గ్రామ పంచాయతీల్లో పంచాయతీరాజ్ డీసీ పర్యటన


తిమ్మాపూర్‌లో సెగ్రిగేషన్ షెడ్‌ని పరిశీలిస్తున్న పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ జాన్ వెస్లీ

తిమ్మాపూర్. జూలై 12: తిమ్మాపూర్ గ్రామాన్ని పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ జాన్ వెస్లీ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయితీ రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రామంలో పారిశు ధ్యం, ప్లాంటేషన్, నర్సరీ, వైకుంఠధామం, సెగ్రిగేషన్ షెడ్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. గ్రామ పంచాయితీ పనితీరు బాగుందని అభినందించారు. వివిధ జిల్లాల పంచాయితీల కార్యదర్శులకు తిమ్మాపూర్‌లో శిక్షణ ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో డీపీవో రవీందర్, డివిజనల్ పంచాయతీ అధికారి రాంబాబు, ఎంపీడీవో విజయ్‌కుమార్, ఎంపీవో కిరణ్ కుమార్, పంచాయితీ కార్యదర్శి కె మహేందర్ రావు, గ్రామ పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

● జమ్మికుంట రూరల్: మండలంలోని గండ్రపల్లి గ్రామపంచాయతీని పంచాయతీ రాజ్ డిప్యూటీ కమీషనర్ జాన్ వేస్లీ శుక్రవారం సందర్శించారు. గ్రామంలోని నర్సరీ, వైకుంఠదామం, పల్లె ప్రగతి, డంపింగ్‌యార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో కరీంనగర్, హుజూరాబాద్ డీఎల్పీవోలు శ్రీనివాస్, రాంబాబు, ఎంపీడీవో భీమేష్, ఎంపీవో సతీష్ కుమార్, ఏపివో లక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శి ఝాన్సీరాణి పాల్గొన్నారు.

### మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలి

సైదాపూర్, జూలై 12: మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలని మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు పిట్ట రవీందర్, ఉపాధ్యక్షుడు పెసరు కుమార స్వామి మత్స్యశాఖ కమిషనర్ ప్రియాంక అలా, మత్స్య పారిశ్రామిక సంఘం రాష్ట్ర చైర్మన్ మెట్టు సాయికుమార్‌ను కోరారు. వారు హైదరాబాద్‌లో అధికారులను శుక్రవారం కలిశారు. కరీంనగర్ జిల్లాలోని 26 సంఘాల పరిధిలో సభ్యత్వ నమోదుకు స్కిల్ టెస్ట్ పూర్తి చేసుకుని ప్రొజిలింగ్ కోసం ఎదురు చూస్తున్నారన్నారు. వారికి త్వరగా ప్రొజిలింగ్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ముదిరాజ్ నాయకులు పాల్గొన్నారు.

## సోలార్ స్మార్ట్ క్లాస్‌లపై శిక్షణ తరగతుల ముగింపు

కరీంనగర్ టౌన్, జూలై 12: కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ప్రభుత్వ ఉపాధ్యాయులకు సైన్స్ పరికరాలు, సోలార్ స్మార్ట్ క్లాస్‌లపై నగరంలోని ఫిల్మ్‌భవన్‌లో శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి సీహెచ్ వీఎస్ జనార్దన్‌రావు మాట్లాడుతూ యునిసెఫ్ సంస్థ సమగ్రశిక్ష తెలంగాణ సంయుక్త ఆధ్వర్యంలో హిందూస్తాన్ పెట్రోలియం సహకారంతో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని 125 పాఠశాలలకు అందించిన సైన్స్ పరికరాలతో శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. ఉపాధ్యాయులు శిక్షణ కార్యక్రమాల్లో నేర్చుకున్న అంశాలను తరగతి గదుల్లో విద్యార్థులకు ప్రయోగాత్మకంగా బోధించాలన్నారు. కరీంనగర్, సిద్దిపేట, హన్మకొండ జిల్లాలకు చెరందిన 23 పాఠశాలల సైన్స్ ఉపాధ్యా యులకు సోలార్ ప్రొజెక్టర్ నిర్వహణ, సైన్స్ పరికరాల వినియోగంపై శిక్షణ తరగతులు ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 15న సోమవారం కరీంనగర్‌లోని ధన్గరివాడీ పాఠశాలలో అటల్ టింకరింగ్ ల్యాబ్‌పై కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాల ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం ఉంటుందని, అందరూ హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో యూనిసెఫ్ సంస్థ మానిటరింగ్ డైరెక్టర్ కె గిరిజాశంకర్, రిసోర్స్ పర్సన్ రాజు, ప్రాజెక్టు ఇంజనీర్ వికాస్, డిల్లీ సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్ అభిషేక్ దిక్షిత్ కాన్పూర్ జిల్లా సైన్స్ అధికారి జైపాల్‌రెడ్డి, ప్లానింగ్ కో-ఆర్డినేటర్ అబ్దుల్ బారీ, కె అశోక్‌రెడ్డి, ఏఎంవో అంజనేయులు, సీఎంవో ఎ శ్రీనివాస్, బాస్కర్, తొర్తి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## సల్లంగ చూడు పోచమ్మ తల్లి


నెత్తిన బోనంతో ఊరేగింపులో పాల్గొన్న చైర్ పర్సన్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల టౌన్, జూలై 12: ఊరు వాడా సల్లంగ చూడు పోచమ్మ తల్లి అంటూ జగిత్యాల జిల్లా కేంద్రంలోని తులసీనగర్, అన్నపూర్ణ చౌరస్తాలో ఉన్న గంగపుత్ర సంఘం వార్డుల్లోని భక్తుల ఆధ్వర్యంలో శుక్రవారం పోచమ్మ తల్లికి బోనాల పండుగ కార్యక్రమాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఇంటికో బోనం నెత్తిన ఎత్తుకుని ఊరేగింపు నిర్వహించారు. ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి కార్యక్రమంలో పాల్గొని నెత్తిన బోనం ఎత్తుకుని మహిళలకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం డీజే పాటలు, కోలాటాల మధ్య పోచమ్మ తల్లి ఆలయం వరకు ఊరేగింపు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సిరికొండ పద్మ సింగారావు, తొపారపు లావణ్య రజనీకాంత్ పాల్గొన్నారు.

## హుజూరాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడికి డాక్టరేట్

హుజూరాబాద్, జూలై 12: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వాణిజ్య శాస్త్ర విభాగాధిపతిగా పని చేస్తున్న లక్ష్మీనర్సింహమూర్తి శుక్రవారం డాక్టరేట్ అందుకున్నారు. లక్ష్మీనర్సింహామూర్తి చైతన్య డీమ్డ్ యూనివర్సిటీలో 'కస్టమర్ పర్‌సెప్షన్ టు వర్డ్స్ డిజిటల్ బ్యాంకింగ్ ఏ సెలక్ట్ స్టడీ' అనే అంశంపై పరిశోధన చేయగా, డాక్టరేట్ పొందారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపక బృందం లక్ష్మీనర్సింహామూర్తిని సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఇందిరాదేవి, అధ్యాపకులు దినకర్, శ్రీనివాస్, మధు, పరమేష్, శ్యామలదేవి, హరిప్రసాద్, సమ్మయ్య, స్వరూప, స్వప్న, రాజ్‌కుమార్, రమేష్, శ్రీలత, స్పందన, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# శిథిలావస్థలో పోస్ట్‌మార్టం గది



జమ్మికుంట ఆసుపత్రిలో శిథిలావస్థకు చేరుకున్న పోస్టుమార్టం గది, కొత్తగా కేటాయించిన స్టోర్ రూం చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలు

జమ్మికుంట, జూలై 12: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్ట్‌మార్టం గది పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. 1988లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దగ్గుపాటి వెంకటేశ్వర్‌రావు ప్రభుత్వ ఆస్పత్రిని ప్రారంభించారు. పాత భవనం నిర్మించి 35సంవత్సరాలు గడవడంతో పూర్తిగా శిథిలవస్థకు చేరుకుంది. 2018లో ఆసుపత్రికి కొత్త భవనం నిర్మించి ప్రారంభించారు. భవణం కోసం కోట్లాది రూపాయాలు వెచ్చించిన ప్రభుత్వం పోస్ట్‌మార్టం గది కోసం పది లక్షలు మంజూరు చేయలేక పోవడంపై పలువురు అప్పటి మంత్రి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లారు. నూతన ఆసుపత్రి భవన నిర్మాణం పూర్తయి ఏడేళ్లు గడుస్తున్నా పోస్టుమార్టం నూతన గది నిర్మాణం కోసం నిధులు మంజూరు కాక పోవడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

### ● స్టోర్‌రూం కేటాయించినా..

ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఉన్న పోస్ట్‌మార్టం గది శిథిలావస్థకు చేరుకోవడంతో పాడుబడిన స్టోర్‌రూమ్‌ను తాత్కాలికంగా కేటాయించారు. స్టోర్‌రూమ్ కొత్తగా కనపడేందుకు ముందు బాగంలో మాత్రమే పెయింటింగ్ వేయించారు. చుట్టూ, వెనుక భాగం చెట్టు, గడ్డి మొక్కలతో నిండిపోయింది.

## నాటు సారా పట్టివేత

గన్నేరువరం, జూలై 12: ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు మండలంలోని గుండ్లపల్లి, గునుకుల కొండాపూర్, జంగపల్లి గ్రామాల్లో శుక్రవారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఏడు లీటర్ల నాటు సారాను పట్టుకుని స్వాధీనం చేసుకు న్నారు. మోత్కులపల్లిలో నాటు సారాను తయారుచేసిన సం పంగి కొమురయ్య, ఇరుగదిండ్ల పాపయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ ఎస్ బాబా తెలిపారు. నాటుసారా తయారు చేసినా, అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్‌ఐ శ్రీకాంత్, సిబ్బంది నరేష్, కొండల్‌రెడ్డి, మనోహర్, రజిత, వంశీ పాల్గొన్నారు.

### బైండోవర్ అతిక్రమణకు రూ.30 వేల జరిమానా

జమ్మికుంట, జూలై 12: జమ్మికుంట మండలం వావిలాలకు చెందిన దుస్స కొమురయ్య అనే వ్యక్తి గతంలో నాటుసారా విక్రయాలు జరుపగా ఎక్సైజ్ పోలీస్‌లు అదుపులోకి తీసుకోని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. బైండోవర్ తర్వాత నిబంధనలను అతిక్రమించి తిరిగి నాటుసారా అమ్మడంతో అతడిని అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ ఎస్‌ఐ సౌమ్య తహసీల్దార్ విజయ ఎదుట హాజరు పరిచారు. బైండోవర్ అతిక్రమించిన కొమురయ్యకు తహసీల్దార్ 30 వేల రూపాయల జరిమానా విధించారు.

# అంజన్న హుండీ ఆదాయం రూ.65.39 లక్షలు



కొండగట్టు, ఇల్లందకుంట ఆలయాల ఆవరణలో హుండీ లెక్కిస్తున్న సిబ్బంది, భక్తులు

మల్యాల, జూలై 12: కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానానికి హుండీల ద్వారా 65,39,167 రూపాయల ఆదాయం సమకూరినట్లు ఈవో ఎ చంద్రశేఖర్ తెలిపారు. 35 రోజులకు గాను ఆలయంలోని 12 అంజన్న హుండీలను విప్పి శుక్రవారం లెక్కించారు. నగదుతోపాటు 30 గ్రాముల మిశ్రమ బంగారం, 1.85 కిలోల మిశ్రమ వెండి, 38 విదేశీ కరెన్సీ నోట్లు లభించినట్లు ఈవో తెలిపారు. ఈ లెక్కింపులో వరంగల్ ఏసీ కార్యలయం పరిశీలకులు కవిత, ఏఈవో అంజయ్య, పర్యవేక్షకులు శ్రీనివాస్‌శర్మ, చంద్రశేఖర్ శ్రీ లలిత సేవా ట్రస్ట్ సభ్యులు లెక్కింపులో పాల్గొన్నారు.

### ● ఇల్లందకుంట ఆలయ ఆదాయం రూ. 7.23 లక్షలు

ఇల్లందకుంట: ఇల్లందకుంట మండల కేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో శుక్రవారం హుండీలను ఆలయ కార్యనిర్వాహణాధికారి కందుల సుధాకర్ ఆధ్వర్యంలో లెక్కించారు.

ఈ మేరకు 70 రోజుల్లో సమకూరిన హుండీల ద్వారా 7,23,433 రూపాయలు సమకూరింది. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్లు కావటి మోహన్, రాజయ్య, మల్లారెడ్డి, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## ఎస్సారెస్పీకి తగ్గిన ఇన్‌ఫ్లో

జగిత్యాల, జూలై 12 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో తగ్గింది. శుక్రవారం ఎస్సారెస్పీలోకి 479 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 90.323 టీఎంసీలు కాగా ప్రస్తుతం 12.44 టీఎంసీల నీరు ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 17.453 టీఎంసీల నీరు ఉంది. ప్రా జెక్టు నుంచి 479 క్యూసెక్కుల నీటిని వదిలారు. జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 6.615 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది.

## చికెన్ సెంటర్‌లో అగ్నిప్రమాదం

కరీంనగర్ క్రైం, జూలై 12: కరీంనగర్ మారుతీనగర్ చౌరస్తాలో భారత్ చికెన్ సెంటర్‌లో శుక్రవారం ఉదయం అగ్నిప్రమాదం జరిగింది. షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు అంటుకుని షాపులోని టీవీ, సీసీ కెమెరాలు, విద్యుత్ మీటర్, కౌంటర్, వేయింగ్‌మిషన్ కాలిపోయాయయని చికెన్ సెంటర్ యజమాని ఎండీ ఇస్మాయిల్ తెలిపారు. దాదాపు లక్ష రూపాయల వరకు నష్టం జరిగిందన్నాడు. సంఘటనా స్థలాన్ని ఎంఐఎం నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ సందర్శించారు. బాధితుడికి ప్రభుత్వం ఆర్థిక సహాయాన్ని అందించి ఆదుకోవాలని కోరారు.

## పేకాట స్థావరంపై పోలీసుల దాడి

మెట్‌పల్లి రూరల్, జూలై 12: మండలంలోని వేంపేట శివారులోని వ్యవసాయ క్షేత్రంలో పేకాట స్థావరంపై ఎస్‌ఐ చిరంజీవి సిబ్బందితో కలిసి దాడి చేశారు. శుక్రవారం గ్రామ శివారులో ఎనిమిది మంది పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు మఫ్టీలో సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఐదుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 14,200 రూపాయలు స్వాధీనం చేసుకున్నామన్నారు.

## తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

మల్యాల, జూలై 12: మండలంలోని రామన్నపేటలో ఉమ్మడి రవి అనే వ్యక్తి ఇంట్లో దొంగతనం జరిగింది. రవి కుటుంబసభ్యులు తమ ఇంటికి తాళం వేసి సమీపంలోని సంఘ భవనంలో ఉంటున్నారు. శుక్రవారం తెల్లవారు జామున తాళం వేసి ఉన్న ఇంటి తాళాలు పగులగొట్టి ఇంట్లో బీరువా తెరిచి వెండి నగలు, ఇతర వస్తువులను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై నరేష్, పోలీసులు సంఘటన స్థలం పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నాడు.

● మెట్‌పల్లి: పట్టణంలో మనోహర్ గార్డెన్ సమీపంలోని తాళం వేసిన ఓ ఇంట్లో శుక్రవారం చోరీ జరిగింది. పట్టణానికి చెందిన లక్కం పద్మ ఉదయం ఇంటికి తాళం వేసి బంధువులను కలవడానికి మరోగ్రామానికి వెళ్లింది. సాయంత్రం ఇంటికి వచ్చి చూసే సరికి ఇంటి తాళం పగలగొట్టి ఉంది. అనుమానం వచ్చి లోపలికి వెళ్లి చూసేసరికి ఇంట్లో దాచిన ఆరు తులాల బంగారు అభరణాలు, ఐదు వేల నగదు చోరీ జరిగినట్లు గుర్తించింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించింది. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

## కుమారుడి మృతిపై అనుమానాలున్నాయని డీజీపీకి ఫిర్యాదు

చొప్పదండి, జూలై 12: తమ కుమారుడు మంద విను మృతిపై అనుమానాలు ఉన్నాయని చొప్పదండికి చెందిన మంద మహేందర్, నీరజ డీజీపీ ఫిర్యాదు చేశారు జనవరి 21న ములుగు జిల్లా మేడారం గ్రామానికి మంద విను మరో ముగ్గురితో కలసి వెళ్లాడు. 22న విను మృతిచెందాడని తమ కు సమాచారాన్ని అందిందన్నారు. విను మృతిపై అనుమా నాలు ఉన్నాయని తాడ్వాయి పోలీసులకు చెప్పినా పట్టించు కోలేదని, తమకు న్యాయం చేయాలని డీజీపీని కోరారు.

## ఆగి ఉన్న వాహనాన్ని ఢీకొని యువకుడి మృతి

పెద్దపల్లి రూరల్, జూలై 12: మండలంలోని రాఘవపూర్ గ్రామానికి చెందిన రమేష్ (29) ద్విచక్ర వాహనంపై వెళుతూ ఆగి ఉన్న వాహనాన్ని ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రమేష్ శుక్రవారం కిరాణ దుకాణానికి ఇంటి నుంచి ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. ద్విచక్ర వాహనం అదుపుతప్పి రోడ్డుపై నిలిచి ఉన్న వాహనాన్ని ఢీకొంది. రమేష్ తండ్రి తిరుపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బసంత్‌నగర్ ఎస్‌ఐ స్వామి తెలిపారు.

## వరినాటు యంత్రం బోల్తా: డ్రైవర్‌కు గాయాలు

శంకరపట్నం, జూలై 12: మండలంలోని కన్నాపూర్ శివారులో శుక్రవారం వరినాటు యంత్రం బోల్తా పడి డ్రైవర్ కు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కన్నాపూర్ శివారులో చెరువు కట్టపై నుంచి వరినాటు యంత్రం వెళుతుండగా అదుపుతప్పి కట్ట కింద బోల్తా పడింది. మిషన్ కింద డ్రైవర్ పడి కేకలు వేయడంతో సమీపంలోని ప్రజలు అక్కడికి చేరుకొని వరినాటు మిషన్ పైకి లేపి డ్రైవర్‌ను బయటకు తీశారు. గాయాలైన డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్ తమిళనాడుకు చెందిన వ్యక్తి కావడంతో అతడి వివరాలు తెలియరాలేదు.

## మూడు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

జమ్మికుంట రూరల్, జూలై 12: వీణవంక మండలం పోతిరెడ్డిపల్లి సమీపంలోని మానేరు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను జమ్మికుంట మండలం కోరపల్లి గ్రామంలో శుక్రవారం పోలీస్‌లు పట్టుకున్నారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుక తర టలిస్తున్న ప్రశాంత్, శ్రీకాంత్, పరుశురామ్‌పై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

## రూ. 7,550 పలికిన పత్తి ధర

జమ్మికుంట, జూలై 12: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7550 రూపాయలు పలికింది. శుక్రవారం మార్కెట్ యార్డుకు 193 క్వింటాళ్ల విడి పత్తి వచ్చింది. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర 7,550, కనిష్ఠ ధర 7,200 రూపాయలు చెల్లించి పత్తి కొన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ

మంథనిరూరల్, జూలై 12: మండలంలోని నాగారంలో బీఆర్ఎస్ నేత బూడిద రాజయ్య తండ్రి బూడిద బుచ్చయ్య ఇటీవల మృతిచెందగా పార్టీ మంథని నియోజకవర్గ ఇంచార్జి పుట్ట మధు శుక్రవారం పరామర్శించారు. బీఆర్ఎస్ నేతలు ఏగోళపు శంకర్‌గౌడ్, తగరం శంకర్‌లాల్, బెల్లంకొండ ప్రకాష్‌రెడ్డి, మంథని లక్ష్మణ్‌లు పాల్గొన్నారు.

## ఇన్‌చార్జి ఏజీపీగా వెంకట్రామిరెడ్డి

మంథని, జూలై 12: మంథని సీనియర్, జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టులకు ఇంచార్జి ఏజీపీగా కట్కూరి వెంకట్రామిరెడ్డిని నియమిస్తూ శుక్రవారం పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీహర్ష ఉత్తర్వులు జారీచేశారు. వెంకట్రాంరెడ్డి నియామకంపై మంథని బార్ అసోసియేషన్ జూనియర్ న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

## ఎల్లమ్మ ఆలయంలో పారాయణం

మంథని, జూలై 12: ఆషాఢ మాసం సందర్భంగా స్థానిక శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయంలో భక్తులు శుక్రవారం శ్రీలలిత పారాయణం చేశారు. ఈసందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఓడి బియ్యం సమర్పించారు. ఈకార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## సైబర్ మోసాలపై విద్యార్థులకు అవగాహన

యైటింక్లయిన్‌కాలనీ, జూలై 12:సైబర్ నేరాలపై గోదావరిఖని టూటౌన్ పోలీస్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం స్పందన మోడల్ స్కూల్ విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్సై వెంకటేష్ మాట్లాడారు. మొబైల్ ఫోన్ల ద్వారా జరిగే సైబర్ నేరాలు, ఆర్థిక నేరాలు జరిగే తీరును వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

సుల్తానాబాద్, జూలై 12:సుల్తానాబాద్ పట్టణంలోని సబ్‌స్టేషన్ నిర్వహణపరమైన మరమ్మతుల నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరా కొంతసేపు నిలిపివేయడం జరుగుతుందని ఏఈ రంగు శంకరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మత్తులతోపాటు 11 కేవీ లైన్ పరిధిలో చెట్లు కొట్టడం జరుగుతుందని దీంతో ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కరెంట్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, ప్రజలు సహకరించాలని కోరారు.

## ఆర్జీ-3లో కొనసాగుతున్న రిలే దీక్ష

రామగిరి, జూలై 12: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బొగ్గు గనుల వేలం రద్దు చేయాలనే ప్రధాన డిమాండ్ పై ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న రిలే నిరాహారదీక్ష 5వ రోజుకు చేరుకుంది. ఆర్జీ-3 జీఎం కార్యాలయంలో రిలే దీక్షలో నాయకులు జూపాకరాంచందర్, ఎంఆర్‌సీ రెడ్డి, గంగాధర్, వెంకటస్వామి, మల్లేష్, రాజయ్య, రాజేందర్, శ్రీనివాస్, సంపత్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

ఓదెల, జూలై 12 : ఏక కాలంలో రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తానని ప్రకటించడంపై శుక్రవారం మండలంలోని భాయమ్మపల్లిలో కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అలాగే మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే విజయరమణరావు, చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించిన అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు మూల ప్రేమ్ సాగర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ ఆళ్ల సుమన్ రెడ్డి, పడాల రాజు, అలేటి సంపత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## డీపీవో పర్యటన

రామగిరి, జూలై 12: మండలంలోని నాగేపల్లి, రాజాపూర్, రత్నాపూర్ గ్రామాల్లో డ్రై డే.. ఫ్రైడేను పురస్కరించుకొని డీపీవో ఆశాలత శుక్రవారం పర్యటించారు. గ్రామాల్లో శానిటేషన్ వర్క్సును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శైలజారాణి, అధికారులు పాల్గొన్నారు.

## త్రీడీ ఆర్ట్ ఫెస్టివల్‌కు అవకాశం

రామగిరి, జూలై 12: అమెరికాలో ఏటా మెట్రోనేట్ సంస్థ నిర్వహించే చాక్ ఆర్ట్ ఫెస్టివల్‌లో భారతదేశం నుంచి అంతర్జాతీయ త్రీడీ ఆర్టిస్ట్ కృష్ణకు అవకాశం లభించింది. అమెరికాలోని ఒమాహ నగరంలో ఆగస్టు 17, 18 తేదీలలో జరగబోయే ఫెస్టివల్‌కు వెళ్లనున్నారు.

# రేపటి నుంచి మల్లన్న పెద్దపట్నం మహోత్సవం



వేడుకలకు ముస్తాబైన ఓదెల మల్లన్న క్షేత్రం



మల్లికార్జున స్వామి విగ్రహం

ఓదెల, జూలై 12 : జిల్లాలో ప్రసిద్ధిగాంచిన ఓదెల భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయం పెద్దపట్నం,అగ్నిగుండ మహోత్సవాలకు ముస్తాబైంది. ఆలయంలో ఈనెల14న ఆదివారం రాత్రి పెద్దపట్నం మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఈవో సదయ్య, ఆలయ చైర్మన్ మేకల మల్లేశం తెలిపారు. అలాగే 15 తెల్లవారుజామున 5 గంటలకు అగ్నిగుండం మహోత్సవం వైభవంగా నిర్వహిస్తున్నామని, అనంతరం దక్షయాగ కథ శ్రావణం, గెలుపు ఉత్సవం, ఉదయం 9 గంటలకు స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, హారతి, మంత్రపుష్పం తదితర పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈనెల 15 వరకు నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలకు భక్తులు ఉమ్మడి జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో హాజరుకానున్నారు. ఆలయం వరకు హుజూరాబాద్, కరీంనగర్ ఆర్టీసీ డిపోల నుంచి బస్సులు నడువనున్నాయి. ఆలయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా, సరిపడే విధంగా సౌకర్యాల ఏర్పాట్లు చేశారు. ఆలయ పరిసరాలన్నీ సుందరంగా తీర్చిదిద్దారు. వేడుకల ప్రాంగణాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆలయం వద్ద పోలీస్ పికెట్ ఏర్పాటుచేసి పొత్కపల్లి, కాల్వశ్రీరాంపూర్ ఎస్ఐల ఆధ్వర్యంలో భద్రత బలగాలతో ప్రత్యేక ఏర్పాట్లను చేశారు.

# వరి నాట్లకు వలస కూలీలు



రంగంపల్లిలో వరి నాట్లు వేస్తున్న ఉత్తరప్రదేశ్ కూలీలు

సుల్తానాబాద్, జూలై 12: మండలంలోని పలు గ్రామాల్లో వరి నాట్లు జోరుగా సాగుతున్నాయి. గతంలో మాదిరిగా ఈసారి గ్రామాలలో ఉత్తర ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన కూలీలు నాట్లు వేస్తున్నారు. ఐదు నుంచి పదెకరాలు ఆపైన పొలాలు కలిగిన రైతులు ప్రస్తుతం ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన కూలీల పట్ల ఆసక్తి కనబరుస్తూ వారితోనే నాట్లు వేయిస్తున్నారు. స్థానికంగా మహిళా కూలీల కొరత ఉందని,ఒకవేళ ఉన్నా కూలీ రేట్లు అధికంగా ఉండడంతో రైతులపై ఆర్థిక భారం పడుతోంది. దీంతో యూపీ నుంచి వచ్చిన కూలీలను మాట్లాడుకుని వారితో నాట్లు వేయిస్తున్నారు. ఎకరానికి ఐదు వేల చొప్పను వీరు తీసుకుంటున్నారు. ఒక్కో కూలీల బృందంలో 15 నుంచి 20 మంది ఉంటున్నారు. వీరంతా కలిసి రోజుకు 5 నుంచి 7ఎకరాల వరకు నాట్లు వేస్తున్నారు.

## స్వచ్ఛ శుక్రవారం

కాల్వశ్రీరాంపూర్, జూలై 12: మండలంలో స్వచ్ఛ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, ఆయా శాఖల ఉద్యోగులు గ్రామాల్లో మురుగుకాలువలు పరిశీలించారు. నీటిని ఎక్కువ రోజులు నిలువ ఉంచుకోవడం వలన దోమలు వ్యాప్తిచెంది డెంగ్యూ వచ్చే అవకాశం ఉందన్నారు. వాడల్లో చెత్త వేయకూడదని, ఇంట్లోని చెత్త బయటవేస్తే సమాచారం ఇవ్వాలని గ్రామస్తులకు తెలియజేశారు. గ్రామ పంచాయతీ సిబ్బందితో గ్రామాల్లో బ్లీచింగ్ చల్లించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జాహెద్‌పాషా, ఎంపీడీవో రామ్మోహనచారి, ఎంపీవో గోవర్ధన్, డాక్టర్లు శ్రీనివాస్, మహేందర్, భావన, పీహెచ్ఎన్ భాగ్యలక్ష్మి, హెల్త్ సూపర్వైజర్ సరోజన, గ్రామ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదు

కమాన్‌పూర్, జూలై 12 : మంథని నియోజకవర్గ అభివృద్ధి అహర్నిషలు కృషి చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబుపై, ప్రజసేవ లక్ష్యంగా పనిచేస్తున్న మంత్రి సోదరుడు శ్రీనుబాబుపై బీఆర్ఎస్ నాయకులు అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని కాంగ్రెస్ నాయకులు స్పష్టం చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ హైదరాబాద్‌లో ప్రెస్‌మీట్‌లు పెట్టి పుట్ట మధు అబద్దాలు చెబితే నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరన్నారు. పుట్ట మధు పద్ధతి మార్చుకోవాలన్నారు. లేని పక్షంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముట్టించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో నాయకులు ఎండీ ముస్తాక్, రంగు సత్యంగౌడ్, అనవేణి లక్ష్మీరాజం,గాండ్ల మోహన్, గడప కృష్ణమూర్తి, గడప గట్టయ్య, అంబీరు శ్రీను, రఫీక్, భూంపెల్లి రాజయ్య, నగునూరి నర్సయ్యగౌడ్, బిల్ల కృష్ణ, మల్యాల మహేష్‌గౌడ్, మేడగొని విజయ్‌గౌడ్, అందిరు శ్రీనివాస్,పంజా సాయిరామ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

## అమరావతి మేజిక్ ఫెస్టివల్‌కు ఖని ఇంద్రజాలికులు

కోల్‌సిటీటౌన్, జూలై 12: ఏపీ మెజిషియన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 14 ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం గుంటూరులో జరగనున్న 40వ ఇంద్రజాల మహోత్సవానికి గోదావరిఖనికి చెందిన ఇంద్రజాలికులు మేజిక్ రాజా, మేజిక్ హరిలు పాల్గొననున్నారు. ఈ ఉత్సవానికి తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి 150 మందికి పైగా ఇంద్రజాలికులు పాల్గొంటున్నారు. అయితే ఈ ఉత్సవంలో మేజిక్ రాజా, మేజిక్ హరిలు విశిష్ట మెజిషియన్ అవార్డులు అందుకోనున్నారు.

## అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ పట్టివేత

పాలకుర్తి, జూలై 12: పెద్దపల్లి మండలం రాగినేడు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న బసంత్‌నగర్‌కు చెందిన సార్ల ప్రసాదు ట్రాక్టర్‌ను శుక్రవారం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఇంతియాజ్ సిబ్బందితో కలిసి కుర్మపల్లి వద్ద పట్టుకున్నారు. ఇసుక అక్రమ రవాణా సమాచారం తెలిస్తే 9014896496 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఇసుక అక్రమ రవాణాను సహించేది లేదని,నిబంధనలు ఉల్లంఘించి ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని, కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

## అన్నదానం

కమాన్‌పూర్, జూలై 12 : మండల కేంద్రంలోని అంగడి బజార్ వద్ద గల పీరిల మసీదు వద్ద శుక్రవారం పలిగిరి సత్తయ్య ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతియేటా పీరీల మసీదు వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. పదిరోజుల పాటు మసీదుల వద్ద వివిధ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుంది. ఈ అన్నదాన కార్యక్రమంలో మొహర్రం కమిటీ సభ్యులు కొమురయ్య, వెంకన్న, శ్రీను, దుర్గయ్య, రఫీక్, సరిత, అనిల్, సందీప్, పవన్, పరశురాం, అంకుష్ తదితరులు పాల్గొన్నారు.

## యూఎస్‌సీ నంబర్ సరిదిద్దడానికి ఎంపీడీవో ఆఫీసులో సంప్రదించాలి

కాల్వశ్రీరాంపూర్, జూలై 12: విద్యుత్‌కు సంబంధించి యూఎస్‌సీ నంబర్ సరిదిద్దడానికి ఎంపీడీవో కార్యాలయంలో సంప్రదించాలని విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహజ్యోతి పథకంలో భాగంగా సర్వీసులకు సంబంధించి ప్రజాపాలన సేవ కేంద్రంలో యూఎస్‌సీ నెంబర్ మార్చడానికి ప్రభుత్వం కొత్త విధానం ప్రవేశపెట్టిందన్నారు. యూఎస్‌సీ నంబర్ తప్పుగా పడినా, లబ్ధిదారుడు నివాసం మార్చుకున్నట్లయితే వారికి యూఎస్‌సీ నంబర్ మార్చడానికి ఎంపీడీవో కార్యాలయంలో సంప్రదించాలని ఏఈ తెలిపారు.

## ఘనంగా గోరింటాకు ఉత్సవం



గోరింటాకు ఉత్సవంలో పాల్గొన్న చైర్‌పర్సన్ తదితరులు

మంథని, జూలై 12 : ఆషాఢ మాసం సందర్భంగా కాకతీయ పాఠశాలలో గోరింటాకు మహోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రు రమ-సురేష్‌రెడ్డి అతిథిగా హాజరై గోరింటాకు విశిష్టతను పిల్లలకు తెలిపారు. అనంతరం పిల్లలకు గోరింటాకు పెట్టి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సిహెచ్. ప్రదీప్‌రెడ్డి, వైస్‌చైర్‌పర్సన్ శ్రీపతి బానయ్య, కౌన్సిలర్ వీకే.రవి, సమ్మయ్య, డైరెక్టర్లు రవికిరణ్ రెడ్డి, శ్రావణ్‌రెడ్డి, స్రవంతి, పావనిలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రైతు సదస్సును విజయవంతం చేయండి



కరపత్రం ఆవిష్కరిస్తున్న ముదిమడుగుల మల్లయ్య తదితరులు

పాలకుర్తి,జులై 12: తెలంగాణ రైతు సమస్యల సాధన సమితి ఆధ్వర్యంలో ఈనెల 21న గోదావరిఖని సింగరేణి కమ్యూనిటి హాలులో జరిగే రైతు సదస్సుకు ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి సదస్సును విజయవంతం చేయాలని తెలంగాణ రైతు సమస్యల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు ముదిమడుగుల మల్లయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం మండలం పరిధిలోని గుడిపల్లిలో ఆ సదస్సుకు సంబంధించిన కరపత్రాలను రైతులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మల్లయ్య మాట్లాడుతూ దున్నేవాడికే భూమి ఇవ్వాలన్నారు. దేశంలో సహజ వనరులు అన్ని ఉన్నప్పటికీ పాలకుల నిర్లక్ష్యం వల్ల రైతన్నల జీవితాలు దిక్కుతోచని స్థితిలో ఉన్నాయన్నారు. ఈనెల 21న ఆదివారం జరిగే సదస్సుకు హాజరై రైతు సదస్సును జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గంగాధరి రమేష్ గౌడ్, ఈదునూరి పోచయ్య, పొన్నవేని రాజేశం, గుండ అజెయ్, చింతల మురళి, పొన్నవేని రాయమల్లు,చింతకింది మధు,శ్రీరాముల శ్రీధర్ గౌడ్,పురాణం మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌ను సత్కరించిన దళిత నాయకులు

కోల్‌సిటీటౌన్, జూలై 12: తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా నియామితులైన ప్రీతంను గోదావరిఖనికి చెందిన ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కాంపెల్లి సతీష్ కలిసి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రీతంను ఎస్‌సీ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించిన రాష్ట్ర ప్రభుత్వానికి సతీష్ కృతజ్ఞతలుతెలిపారు.

## కుక్కల బెడద నివారణకు చర్యలు తీసుకోండి

### కార్పొరేషన్ కమిషనర్‌కు వీహెచ్ఆర్ ఫౌండేషన్ విజ్ఞప్తి



కమిషనర్ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

కోల్‌సిటీ, జూలై 12: రామగుండం నగరంలో విచ్చలవిడిగా సంచరిస్తూ ప్రజా జీవనానికి ఇబ్బందికి కలిగిస్తూ, దాడులు చేస్తున్న ఊర కుక్కల బెడద నివారణకు చర్యలు తీసుకోవాలని వీహెచ్ఆర్ ఫౌండేషన్ రామగుండం ఇన్‌చార్జి సిగిరి రాము కోరారు. ఈ మేరకు శుక్రవారం రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చింతల శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రజలు నిత్యం కుక్కల బెడదతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రామ గుండం, ఎన్టీపీసీ, గోదావరిఖని, యైటింక్లయిన్‌కాలనీల్లో గుంపులు గుంపులుగా తిరుగుతూ చిన్నారులు, ఒంటరిగా వెళుతున్న వారిపై కుక్కలు దాడులకు పాల్పడుతున్నాయని తెలిపారు. గతంలో చాలాసార్లు దాడులు జరిగిన సందర్భంలో రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల దృష్టికి తీసుకువచ్చినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని, ఇప్పటికైనా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బొల్లం మధుబాబు, బోడిగె శ్రీనివాస్‌గౌడ్, కాసర్ల రవీంద్రచారి, సిగిరి తిరుపతి, బొడ్డుపల్లి రామేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాద బీమా చెక్కు అందజేత

కళ్యాణ్‌నగర్, జూలై 12: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన బండ శశికుమార్ కుటుంబానికి శుక్రవారం ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ రవీందర్‌కుమార్ సింగ్ రూ.10లక్షల బీమా చెక్కును అందజేశారు. శివాజీనగర్‌లోని ఎస్‌బీఐ కార్యాలయంలో శశికుమార్ తల్లి కవితకు ఈ చెక్కును అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శశికుమార్ రూ.500 బీమా చెల్లించారని, ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో మరణించడంతో ఈ బీమా డబ్బులు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ మేనేజర్ వెంకటేశ్వర్లు, బ్రాంచ్ మేనేజర్ సతీష్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కుమారుడిని పరామర్శించిన మంత్రి శ్రీధర్‌బాబు



చికిత్స పొందుతున్న ప్రతిక్‌ను పరామర్శిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

గోదావరిఖని, జూలై 12: రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ కుమారుడు ప్రతిక్‌ఠాకూర్ డెంగ్యూతో హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా శుక్రవారం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రతిక్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ వర్షాకాలం సందర్భంగా గ్రామాల్లో, పట్టణాల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇంటి చుట్టుపక్కల నీరు నిల్వకుండా చూసుకోవాలన్నారు. పంచాయతీ అధికారులు, కార్పొరేషన్ అధికారులు పారిశుద్యం, తాగునీటి క్లోరినేషన్‌పై దృష్టి సారించాలని, వ్యాధులు సోకితే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య చికిత్స చేయించుకోవాలని సూచించారు.




## ఆర్జీ-2 జీఎం ఆఫీస్ ఎదుట ఏఐటీయూసీ ధర్నా




ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ శ్రేణులు

యైటింక్లయిన్‌కాలనీ, జూలై 12: బొగ్గు గనుల వేలాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం ఆర్జీ-2 జీఎం ఆఫీస్ ఎదుట ఏఐటీయూసీ శ్రేణులు ధర్నా చేశాయి. ఈనెల 8నుండి జీఎం ఆఫీస్ ఎదుట రిలే నిరాహార దీక్షలు చేసిన నాయకులు శుక్రవారం ధర్నా చేశారు. కొత్త గనులు కేటాయించకుంటే సింగరేణి భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని, కోల్‌బెల్ట్ ప్రాంత ప్రజాప్రతినిధులు కేంద్రంపై ఒత్తిడి తేవాలని నాయకులు డిమాండ్ చేశారు. సింగరేణిని ప్రైవేట్ పరం చేయకుండా అడ్డుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉన్నదన్నారు. తెలంగాణలోని గనులు సింగరేణికి కేటాయించేలా ఉద్యమాన్ని ఉధృతం చేయనున్నామని, కార్మికులు కలిసిరావాలని పిలుపునిచ్చారు. ధర్నాలో ప్రకాష్, రాజారత్నం, రవీందర్, అన్నారావు, శ్యాంసన్, సాంబశివరావు, నారాయణ, రమేష్, విజయ్ పాల్గొన్నారు.

## ఆర్జీ-2లో క్వార్టర్ల కౌన్సెలింగ్

యైటింక్లయిన్‌కాలనీ, జూలై 12: సెక్టార్-3 కాలనీలో ఉద్యోగులకు క్వార్టర్లను కేటాయించేందుకు శుక్రవారం ఆర్జీ-2 యాజమాన్యం కౌన్సెలింగ్ నిర్వహించింది. సీఈఆర్ క్లబ్‌లో జరిగిన ఈ కౌన్సెలింగ్‌కు ఆర్జీ-3 జీఎం ఆఫీస్, ఓసీపీ-2, ఏఎల్‌పీ, 10ఇంక్లయిన్‌లకు చెందిన ఉద్యోగులు హాజరయ్యారు. 968 క్వార్టర్లకు 93 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. కౌన్సెలింగ్‌కు 44 మంది హాజరు కాగా 40మందికి అధికారులు క్వార్టర్లను అలాట్‌చేశారు. ఈ కౌన్సెలింగ్‌లో ఎస్వోటూ జీఎం వెంకటేశ్వరరావు, ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ జీ రవీందర్, పర్సనల్ మేనేజర్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

## ఆర్జీ-1 సీఎస్‌పీని సందర్శించిన డైరెక్టర్ (ఈఅండ్ఎం)

గోదావరిఖని, జూలై 12: ఆర్జీ-1 ఏరియా జీడీకే వన్ సీఎస్‌పీని శుక్రవారం డైరెక్టర్ (ఈఅండ్ఎం) డీ సత్యనారాయణరావు సందర్శించారు. ఈ సందర్భంగా సీఎస్‌పీలోని ఫ్లాగ్ ఫీడర్ మెరిట్ బంకర్, క్రషర్, వాటర్ స్ప్రేయింగ్, కన్వేయర్ బెల్ట్‌సిస్టం, అట్లాస్, జీఎల్‌బంకర్ ద్వారా రేకులో బొగ్గు లోడింగ్ తదితర ప్రదేశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ సత్యనారాయణరావు మాట్లాడుతూ ఆర్జీ-1కు సీఎస్‌పీ గుండెకాయలాంటిదని ఇక్కడి నుండి బొగ్గు త్వరితగతిన రవాణా అయినప్పుడే సంస్థకు లాభాలు వస్తాయని తెలిపారు. బొగ్గు లోడింగ్ సమయంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. బొగ్గు లోడింగ్, ఆన్ లోడింగ్ సమయంలో తప్పనిసరిగా రక్షణ చర్యలను పాటించాలని సుంచించారు. సంస్థ సీఎస్‌పీకి నిర్దేశించిన రేకుల ద్వారా బొగ్గు రవాణా లక్ష్యాలను సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్జీ-1 జీఎం చింతల శ్రీనివాస్, ఏరియా ఇంజనీర్(ఈఅండ్ఎం) డీ వెంకటేశ్వరరావు, సీఎస్‌పీ ఎస్ఈ (ఈఅండ్ఎం) దాసరి శ్రీనివాస్, బీ హరీష్ కుమార్ పాల్గొన్నారు.

# నైనీ బొగ్గు బ్లాక్‌కు మంచి రోజులు

**- ప్రారంభానికి సహకరిస్తామన్న ఒడిస్సా సీఎం మోహన్ చరణ్ - ఫలించిన డిప్యూటీ సీఎం భట్టి ప్రయత్నం**



నైని బొగ్గు బ్లాక్ వద్ద మ్యాప్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం



నైని బొగ్గు బ్లాక్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న భట్టి విక్రమార్క బృందం

గోదావరిఖని, జూలై 12: ఒడిస్సా రాష్ట్రంలో అంగుల్‌జిల్లాలో సింగరేణి కేటాయించబడిన నైని బొగ్గుబ్లాక్ తవ్వకాలకు మంచి రోజులు వచ్చాయి. ఒడిస్సా మోహన్ చరణ్ మంజీ నైని బొగ్గు బ్లాక్ ప్రారంభానికి సహకరిస్తానని హామీ ఇచ్చారు. అంతేకాకుండా ఒడిస్సా రాష్ట్రంలో సంబంధిత అధికారులకు వెంటనే ఇందుకోసం చర్యలు తీసుకోవాలని కూడా ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సీఎండీ బలరాంనాయక్ ఒడిస్సా సీఎంను కలిసి నైని బొగ్గుగనుల ప్రారంభంపై చర్చించారు. ఒడిస్సా సీఎం ఇందుకోసం అన్నిరకాలుగా సహకరించేందుకు అంగీకరించారు. నైని బ్లాక్ తవ్వకానికి పారిశ్రామిక, పర్యావరణ అనమతులు ఇప్పటికే వచ్చిన విషయాన్ని భట్టి విక్రమార్క ఒడిస్సా సీఎంకు వివరించారు. అటవీ, ప్రైవేట్ భూములను సింగరేణికి బదలాయించాల్సిన అంశంపై ఒడిస్సా సీఎంతో భట్టి మాట్లాడారు. సింగరేణికి కేటాయించిన నైని బ్లాక్ ప్రారంభమైతే ఒడిస్సా రాష్ట్రంలోని యువకులకు కూడా పెద్ద సంఖ్యలో ఉద్యోగ, ఉపాధి అవశాలు ఏర్పాడుతాయని, పన్నుల రూపంలో రూ.600కోట్ల వరకు ఒడిస్సా సర్కారుకు అందుతాయని భట్టి విక్రమార్క చెప్పారు. దేశంలో విద్యుత్ సమస్యను పరిష్కరించడానికి ప్రభుత్వరంగంలో ఉన్న సింగరేణి సంస్థ మనుగడకు నైని బొగ్గు గనులు అత్యంత అవసరమని భట్టి విక్రమార్క ఒడిస్సా సీఎంకు వివరించారు. దీనిపై ఒడిస్సా సీఎం వెంటనే స్పందించి భూముల బదలాయింపు, విద్యుత్, రహదారుల సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో మూడు నెలల్లోపే నైనీ బ్లాక్ నుంచి బొగ్గు ఉత్పత్తి ప్రారంభించే అవకాశం ఏర్పడింది. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నైని బొగ్గు బ్లాక్ ప్రాంతాన్ని కూడా సందర్శించారు. ప్రతి సంవత్సరం 10 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసే నైని ప్రాజెక్టు సింగరేణి సంస్థకు గొప్ప వరమన్నారు. నైని బొగ్గు బ్లాక్ భూసేకరణకు సంబంధించి స్టేజ్-1, స్టేజ్-2 అనుమతుల్లో భాగంగా సింగరేణి సంస్థకు కేటాయించి 783 హెక్టార్ల అటవీభూమికి సంబంధించిన చెట్లు లెక్కలు తేలాల్సి ఉందని చెప్పారు. ఒక గ్రామాన్ని తొలగించే అంశం, అందుకు సంబంధించిన నష్టపరిహారాలు, పునరావాసం అంశాలను అక్కడి కలెక్టర్‌తో మాట్లాడారు. నైని బ్లాక్ బొగ్గు సరఫరాకు సంబంధించి కూడా బట్టి విక్రమార్క చర్చించారు. బొగ్గు రవాణా రోడ్డు మార్గాలను కూడా తొందరగా వేయాలని సూచించారు. అందు కోసం సింగరేణి సంస్థ కేటాయించిన రూ.37కోట్లు బడ్జెట్ వివరాలను కూడా తెలియజేశారు. నైని బ్లాక్‌లో బొగ్గు ఉత్పత్తి జరిగితే సింగరేణి ఆధ్వర్యంలోనే 2/800మెగవాట్ల విద్యుత్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసేందుకు నిర్ణయించామన్నారు. ఈ పర్యటనలో, సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెంట రాష్ట్ర విద్యుత్‌శాఖ కార్యదర్శి రోనాల్డ్ రాస్, సింగరేణి సీఎండీ బలరాం, ఇంధనశాఖ ఓఎస్‌డీ సురేందర్‌రెడ్డి, సింగరేణి డైరెక్టర్(ఆపరేషన్స్) ఎన్‌వీకే శ్రీనివాస్ పాల్గొన్నారు.

# మేడిపల్లి ఓపెన్ కాస్ట్‌లో విద్యుత్ ఉత్పాదనపై అవగాహన

గోదావరిఖని, జూలై 12: మూతపడిన మేడిపల్లి ఓపెన్‌కాస్ట్‌లో సింగరేణి సంస్థ పంప్ స్టోరేజీ హైడ్రో ఎలక్ట్రిక్ విద్యుత్ ఉత్పాదన చేపట్టాలని శుక్రవారం ఆర్‌జీ-1 జీఎం కార్యాలయంలో జీఎం చింతల శ్రీనివాస్ అధ్యక్షతన కార్పొరేటర్, వివిధ విభాగాల అధికారులు, టాటా కన్సెల్టింగ్ ఇంజనీరింగ్ లిమిటెడ్‌తో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఎండీ ఎన్ బలరామ్ ఆదేశాల మేరకు డైరెక్టర్ (ఈఅండ్ఎం) డీ సత్యనారాయణరావు మేడిపల్లి ఓసీపీలో ఉన్న నీటితో పాటు గోదావరినది నీటిని కూడా మళ్ళించి పంప్ స్టోరేజీ హైడ్రో ఎలక్ట్రిక్ విద్యుత్ ఉత్పత్తి వ్యవస్థ గల సాధ్యసాధ్యాలను అన్వేషించాలని టాటా కన్సెల్టింగ్ ఇంజనీరింగ్ లిమిటెడ్‌కు, వివిధ విభాగాల అధికారులకు వారికి కావాల్సిన సదుపాయాలు, సమగ్రమైన వివరణాత్మకమైన నివేదిక తయారు చేసి ఇవ్వాలని తెలిపారు. అనంతరం కార్పొరేట్, వివిధ విభాగాల అధికారులు, టాటా కన్సెల్టింగ్ ఇంజనీరింగ్ లిమిటెడ్ ప్రతినిధులు మేడిపల్లి ఓసీపీని సందర్శించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేట్ జీఎం (సోలార్) జానకిరాం, విజయ సారధి, టాటా కన్సెల్టింగ్ ఇంజనీరింగ్ లిమిటెడ్ డీ వెంకటేశ్వరరావు, ఆర్‌జీ-1 ఏరియా ఇంజనీర్ (ఈఅండ్ఎం)శివ నారాయణ, ఏజీఎం(ఎక్స్‌ప్లోరేషన్), వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న జీఎం, అధికారులు